901) వరాళి

ప॥ ఎవ్వారు లేరూ హితవుచెప్పగ వట్టి- | నవ్వుల బడి నేము నాగిలేమయ్యా ॥

చ॥ అడవి బడినవాడు వెడల జోటులేక | తొడరి కంపలకింద దూరినట్లు |
నడుమ దురితకాననములతరి బడి | వెడలలేక నేము విసిగేమయ్య ॥

చ॥ తెవులువడినవాడు తినబోయి మధురము | చవిగాక పులుసులు చవిగోరినట్లు |
భవరోగముల బడి పరమామృతము నోర | జవిగాక భవములు చవులాయనయ్యా ॥

చ॥ తనవారి విడిచి యితరమైనవారి | వెనక దిరిగి తా వెట్టైనట్లు |
అనయము తిరువేంకటాధీశు గొలువక | మనసులోనివాని మఱచేమయ్య ॥